క్లుప్తంగా

రోజువారీ అద్దెలో రాయితీ..

విజయనగరం: నగరంలోని ప్రతిష్టాత్మకమైన ఆనందగజపతి ఆడిటోరియంలో పలు కార్యక్రమాలు నిర్వహించుకునే నిమిత్తం కొన్ని సంస్థలకు అద్దెలో రాయితీ కల్పించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆడిటోరియం నిర్వహణ బాధ్యతలను విజయనగరం కార్పొరేషన్ నిర్వహించనుందని పేర్కొన్నారు. క్రీడా, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఆడిటోరియంలో కార్యక్రమాలు నిర్వహించే వారికి అద్దెలో 50 శాతం రాయితీ అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రైవేట్ కార్యక్రమాలకు రోజుకు రూ. 30 వేల అద్దె వసూలు చేస్తుండగా.. క్రీడలు, సంగీత, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల నిర్వహించే వారికి రూ. 15 వేలకే అద్దెకు ఇస్తామన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి..

విజయనగరం: నగరంలో వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌లు పొందే విషయంలో గణనీయమైన తగ్గింపునకు కౌన్సిల్ ఆమోదించిందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్, వివిధ వాణిజ్య సంస్థల అభ్యర్థన మేరకు ట్రేడ్ లైసెన్స్‌ల రుసుం తగ్గించినట్లు పేర్కొన్నారు. వ్యాపార సంస్థల ప్రతినిధులు ఈ విషయాన్ని గమనించి వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలన్నారు. వాస్తవానికి వ్యాపారం ప్రారంభించే సమయానికి 90 రోజులు ముందుగా ట్రేడ్ లైసెన్స్‌లను పొందాలని కోరారు. అలాగే ఇప్పటికే లైసెన్స్‌లు పొందిన వారు బకాయి పడిన రెన్యువల్ మొత్తాలను చెల్లించాలని పేర్కొన్నారు.

నిబంధనలు పాటించాలి



రేగిడిలో ఆటోలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రేగిడి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదని, నిబంధనల ప్రకారం ఆటోలు నడపాలని ఎస్‌ఐ పి.నీలావతి ఆటో డ్రైవర్లను సూచించారు. మండలంలోని మజ్జి రాముడుపేట, బూరాడ, చిన్నశిర్లాం జంక్షన్ల వద్ద వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు పలు సూచనలు చేస్తూ ఆటోలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, డ్రైవర్లు నిబంధనలను అతిక్రమించకుండా వాహనాలు నడపాలన్నారు. లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బొబ్బిలి: పట్టణంలోని పల్లె వీధిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.రమేష్ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నామని చెప్పారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.9.100ల నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో ఏఎస్‌ఐ జి.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామాజిక సేవతో మానసిక ప్రశాంతత

రేగిడి: సామాజిక సేవ చేయడంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలోని వావిలవలస గ్రామంలో వెలసిన శ్రీరామ ధర్మ క్షేత్రంలో నిర్వాహకులు వారణాసి జగన్నాథ స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక దివ్య మహాసభ బుధవారంనిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానవక్తగా పాల్గొన్న రమణ మాట్లాడుతూ చెట్లు ఫలాలను కాసి ఇతరులకు ఉపయోగపడుతున్నాయన్నారు. నదులు ప్రవహిస్తూ ఇతరులకు ఉపయోగపడుతున్నాయని, గోవులు పాలిచ్చి పరోపకారం చేస్తున్నాయన్నారు. మానవుని శరీరం కూడా పరుల కొరకు ఉపయోగపడాలని, మానవుడు పుట్టినప్పుడు ఏమీ తీసుకురాలేదని, వెళ్లేటప్పుడు కూడా ఏమీ తీసుకువెళ్లడని వివరించారు. దేవుదలకు చెందిన గొర్లె దామోదర రావు, దశమంతుపురానికి చెందిన సతివాడ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

హరిదాసు సందడి



రాజాం పట్టణంలో హరిదాసు సందడి

రాజాం: పట్టణంలో బుధవారం హరిదాసు సందడి చేశారు. పలువీధుల్లో హరినామ సంకీర్తనతో సంచరించారు. భక్తులు హరిదాసు కలశంలో బియ్యం, దక్షిణ వేసి భ భక్తిశ్రద్ధలతో బోగం చెల్లించారు. ఈ హరిదాసు కీర్తనలతో పట్టణంలో పండగ వాతావరం ముందే మొదలైంది.

ఏసే లోక రక్షకుడు..

దేవాదిదేవుడు భూమిపై అవతరించిన వేళ... భక్తులందరూ ఏసు ప్రభువుకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాడవాడలా క్రిస్మస్ పండగను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలతో పాటు యువత నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మత పెద్దలు ఏసు సందేశాన్ని వినిపించారు. చిన్నారులు క్యాండిల్స్ చేతబట్టి శాంతి ర్యాలీలు చేపట్టారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

– విజయనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్/ సాక్షి ఫొటోగ్రాఫర్ విజయనగరం



విజయనగరం టౌన్: బేతని మిషన్ చర్చిలో క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఆర్‌సీఎం చర్చిలో ఏసుక్రీస్తు విగ్రహం వద్ద ప్రార్థన చేస్తున్న చిన్నారి



పూసపాటిరేగ: చర్చిలో మాట్లాడుతున్న పాస్టర్ జీవన్‌కుమార్, తదితరులు



సిమ్స్ ప్లాటినం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అతిధి గజపతి, మత విశ్వాసకులు



కంటోన్మెంట్ బాప్టిస్ట్ చర్చిలో గీతాలు ఆలపిస్తున్న యువతులు



విజయనగరంలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



సిమ్స్ ప్లాటినం చర్చిలో ప్రార్థనలు



నెల్లిమర్ల రూరల్‌సీతారామునిపేట మన్నా చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ స్టీవెన్ పాల్, తదితరులు

వాజ్‌పేయి జాతి గర్వించదగ్గ నేత

- బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి

విజయనగరం టౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జాతి గర్వించదగ్గ నాయకుడని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక లయన్స్ క్లబ్ వద్ద సౌత్‌జోన్ మండలాధ్యక్షుడు ఇప్పిలి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వాజ్‌పేయి శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బవిరెడ్డి మాట్లాడుతూ.. వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. భారతజాతికి శాంతి మంత్రం జపించడమే కాదు, యుద్ధతంత్రం కూడా తెలుసునని నిరూపించిన నాయకుడని కొనియాడారు. తన జీవితాన్ని భారతమాత సేవకు అంకితమిచ్చిన గొప్ప దేశభక్తుడని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంది సీతారాం, బూర జగ్గారావు, తిరుమలరాజు, తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, తదితరులు

టౌన్ ప్లానింగ్ ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం రేపు

విజయనగరం: ఈ నెల 27న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ఓపెన్ ఫోరం కార్యక్రమంతో పాటు ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ షార్ట్‌ఫాల్ దరఖాస్తుల ఆమోదం కొరకు ప్రత్యేక మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ మేళాలో అక్కడికక్కడే ప్రజా సమస్యలు పరిష్కరించి, ప్రణాళికా విభాగం తరఫున అన్ని అనుమతులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

మేపాడ: రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షల జనాభా ఉన్న వెలమ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదువుల్లో కూటమి ప్రభుత్వం తగిన అవకాశాలు కల్పించాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వెలమలను బీసీ–డి నుంచి బీసీ– ఏ జాబితాలోకి మార్చాలని కోరారు. వెలమ రైతులకు రాయితీతో రుణాలు మంజూరు చేయాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రెపాటి బుచ్చిఅప్పారావు పేరును యథావిధిగా కొనసాగించాలని, వెలమ సంక్షేమ సంఘానికి విశాఖపట్నంలో అయిదు ఎకరాల స్థలం కేటాయించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అమరావతితోపాటు ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలని అభ్యర్థించారు. చినగుడిపాల గ్రామ సర్పంచ్ బోజంకి రామునాయుడు, వెలమ సంఘం నాయకులు నిరుజోగి బంగారునాయుడు, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, రావాడ నాయుడు, నచ్చిరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరావు

ఘనంగా వాజ్‌పేయి జయంతి



శృంగవరపుకోట: ఎస్.కోటలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బీహారీ వాజ్‌పేయి జయంతి ఉత్సవాలను స్థానిక విజన్ టెక్నాలజీ కార్యాలయంలో బీజేపీ నాయకుడు డి.సూర్యారావు నేతృత్వంలో బుధవారం ఘనం గా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సూర్యారావు మాట్లాడుతూ వాజ్‌పేయి రాజకీయ దురంధరుడని, రాజనీతిజ్ఞుడని, భారత దేశాన్ని ప్రగతి బాటలో నడిపించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. బీజేపీ నాయకులు కె.ఎల్.రామకోటి,చిరంజీవి, దాశరథి, ఎం.శ్రీను, జగన్నాథం, అప్పారావు,మోహన్ పాల్గొన్నారు.



గజపతినగరం: గజపతినగరంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద వేసి నివాళులర్పిస్తున్న ఏడుకొండలు, తదితరులు

గజపతినగరంలో..

గజపతినగరం: మాజీ ప్రధాన మంత్రి, అటల్ బీహారీ వాజ్‌పేయి జయంతిని మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు నివాసంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడు తూ ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి ఎనలేని సేవలందించారని, రాజకీయాల్లో అత్యున్నత విలువలను నెలకొల్పిన ఆదర్శ నాయకుడని కొనియాడారు.

డిజిటల్ సేవలకు సిద్ధం..

- బలోపేతం దిశగా పీఏసీఎస్‌లు
- రికార్డులన్నీ కంప్యూటరీకరణ
- రైతులకు విస్తృత సేవలు అందించడమే లక్ష్యం

పూసపాటిరేగ: అన్నదాతలకు ఆర్థికంగా తోడ్పాటు అందించడంలో ప్రాథమిక సహకార సంఘాల పాత్ర మరువలేం. అంతటి ప్రాధాన్యత కలిగిన సహకార సంఘాలను బలోపేతం చేసి.. సేవలపై సులభతరం చేయాలనే లక్ష్యంతో కేంద్ర సహకార మంత్రిత్వశాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు అమలవుతున్న సేవలను కంప్యూటరీకరణ చేసి పారదర్శకతకు పెద్దపీట వేయనున్నారు. సహకార సంఘాలలో బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు తీసుకోవడం వంటి పొరపాట్లకు ఇకపై చెక్ పడనుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి పీఏసీఎస్‌లను బ్యాంక్‌లుగా మార్చడానికి కంప్యూటరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్ పరిధిలో సుమారు 25 వేల మంది రైతుల వివరాలు కంప్యూటరీకరణ కానున్నాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పీఏసీఎస్)లలో రైతుల వివరాలు కంప్యూటరీకరణ చేసి తద్వారా మెరుగైన సేవలు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం పీఏసీఎస్‌లలో డేటా అప్‌లోడ్ జరుగుతోంది. పీఏసీఎస్ సీఈఓ లాగిన్ అయ్యాక వివరాలను సూపర్‌వైజర్, సొసైటీ ఆడిటర్ లాగిన్‌లో క్రాస్‌చెక్ చేస్తారు. ఆమోదం లభించిన తర్వాత ప్రీ మైగ్రేషన్ పేరిట గతంలో జరిగిన లావాదేవిలు అప్‌లోడ్ అవుతాయి. ఈ విధానం పూర్తయిన తర్వాత వచ్చే ఏడాది జనవరి నుంచి డిజిటల్ సేవలు అందిస్తారు. పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు, జాతీయనెట్ వర్క్‌లకు అనుసంధానం అయ్యేలా కేంద్రసహకార మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. సొసైటీలలో నమోదైన ప్రతి ఖాతాదారుడికి కంప్యూటరైజ్డ్ పాస్ పుస్తకం ఇస్తారు. దీంతో డేటాలో తప్పులు జరిగే అవకాశం ఉండదు. తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, వడ్డీ వివరాలను ఖాతాదారులు సులువుగా తెలుసుకోవచ్చు. ప్రతి ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు రైతు ఖాతాలకు నేరుగా జమ అవుతాయి.



పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచ్

పీఏసీఎస్‌లు	రైతుల సంఖ్య
పూసపాటిరేగ	1350
వెంపడాం	909
కుమిలి	1050
ఎల్‌పీ పాలెం	980

సేవలు మరింత పారదర్శకం..

రైతులకు అందించే సేవల్లో పారదర్శకత మరింత పెరుగుతుంది. ఎటువంటి సేవలైనా గ్రామ స్థాయిలో పొందవచ్చును. ఎటువంటి పొరపాట్లు జరిగినా సులువుగా అధిగమించవచ్చు. కేంద్ర సహకారమంత్రిత్వ శాఖ ద్వారా సహకార సంఘాలు బ్యాంక్‌లుగా మారనున్నాయి. శత శాతం కంప్యూటరీకరణ జరిగిన తర్వాత డిజిటల్ సేవలు ప్రారంభమవుతాయి.

– గిరి, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్, పూసపాటిరేగ

ఏపీఎన్‌జీఓ కొత్తవలస అధ్యక్షుడిగా ప్రసాదరావు

కొత్తవలస: ఏపీఎన్‌జీఓ కొత్తవలస తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా జె.వి.ప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్‌జీ ఓ భవనంలో తాలూ కా గౌరవ అధ్యక్షుడు రామలక్ష్మణ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఎన్నికలో సభ్యులు ఏకగ్రీవంగా జె. వి.ప్రసాదరావును ఎన్నుకున్నారు.అతిథిగా హాజరైన ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డేగల వెంకటరమణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల ను తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విధుల నుంచి తొలగించడం బాధాకరమన్నారు. వారిని వెంటనే విధుల్లోకి తీసు కోవాలని, బకాయి వేత నాలను వెంటనే విడుదల చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. సంఘం బలోపేతానికి ఉద్యోగులు ఐకమ త్యంతో పని చేయాలని సూచించారు. అనంతరం ప్రసాదరావును సన్మానించారు. సంఘం జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, సభ్యులు రమణమ్మ, సూరిదేముడు, రమణ, కళావతి, స్వర్ణ, భాగ్యలక్ష్మి, సత్యారావు, సూర్యారావు, కృష్ణం నాయుడు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదరావును సత్కరిస్తున్న ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ ,తదితరులు

తప్పులు సరిదిద్దే అవకాశం

తహసీల్దార్లకు ఇవ్వాలి

బాడంగి: భూముల రీసర్వేలో చోటు చేసుకున్న తప్పులను సరిదిద్దే అవకాశం తహసీల్దార్లకు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం జేసీ పరిధిలో ఉన్న సవరణ యాప్ తహసీల్దార్ యాప్ ద్వారా పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గతంలో రెవెన్యూ సిబ్బంది తెలియక చేసిన తప్పిదాలు తమకు శాపంగా మారాయని వాటిని సరిదిద్దే అవకాశం తహసీల్దార్లకు ఇస్తే తమకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. జిల్లాలో బాడంగి, రామభద్రపురం మండలాలను పైలట్ పథకంగా తీసుకొని రీసర్వే పూర్తి చేశారు. అయితే అప్పట్లో ఉన్నతాధికారుల మెప్పుకోసం త్వరితగతిన సర్వే చేయాలన్న ఆతృతతో ఏడాదిలోగానే 27 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు. దీంతో జాయింట్ ఎల్‌పీఎంలు, తప్పుడు ఖాతాలు, పొంతన లేని సర్వే నంబర్లు రావడంతో ఆన్‌లైన్‌లో వన్ బీ సమస్య, రిజిస్ట్రేషన్ల సమస్య తలెత్తింది. వీటిని సరి చేసి సమస్య పరిష్కరించాలంటే తహసీల్దార్లకు తలకు మించిన భారంగా మారింది. ఈ విషయమై ఆలోచించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. కూటమి మళ్లీ రీసర్వేకు సిద్ధమవుతున్న వేళ తప్పులు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.